ప్రజాశక్తి

శనివారం 11 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

నిలిచిన ఎన్‌టిఆర్ వైద్య సేవలు

- విశాఖలో 27 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో బంద్
- రూ.145 కోట్ల బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- రోగులకు ఇబ్బందులు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నెలలుగా బకాయి పడ్డ బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విశాఖ నగరంలోని పలు ఆసుపత్రులు ఎన్‌టిఆర్ వైద్య సేవలను శుక్రవారం నుంచి నిలిపేశాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కు. దీనిపై కూటమి సర్కారు తొలి నుంచీ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందనే విమర్శలున్నాయి. విశాఖలోని ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) నెట్‌వర్క్ ఆసుపత్రులకు సుమారు రూ.145 కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఏడు నెలలుగా 'కూటమి' ప్రభుత్వం వీటిని ఇవ్వడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి ఎన్‌టిఆర్ వైద్య సేవలను నిలిపివేయాలని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు నిర్ణయానికొచ్చాయి. ఈ క్రమంలోనే జిల్లాలోని 27 ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలిపివేశాయి. ఎపి స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ ఇప్పటికే వైద్య సేవలను నిలిపివేసే నిర్ణయం చేసింది. అనేక రూపాల్లో తమ ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ స్పందన కరువైందని ఆసుపత్రి యాజమాన్యాలు బాహాటంగానే చెబుతున్నాయి.

ప్రభావమెంత ?

ఎన్‌టిఆర్ వైద్య సేవ స్కీంలో విశాఖ జిల్లాలో రోజుకు 400 మంది రోగులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స కోసం వస్తుంటారు. శస్త్రచికిత్సలు, గుండె ఆపరేషన్లు, ఇతర వైద్యసేవల కోసం వారంతా ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. సేవలను నిలిపివేసినా.. కేన్సర్, కిడ్నీ తదితర సేవలు ఏవైతే ఆసుపత్రుల్లో ఉండి ప్రజలు తీసుకుంటున్నారో వాటిని కొనసాగిస్తామని అసోసియేషన్ వారు వెల్లడించారు.

విశాఖ జిల్లా ఎన్‌టిఆర్ వైద్యసేవల కో-ఆర్డినేటర్ ఏమన్నారంటే?

ఎన్‌టిఆర్ వైద్యసేవ విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ కె.అప్పారావు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 62 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ ఆరోగ్య వైద్య సేవలు అందిస్తుండగా శుక్రవారం నుంచి వాటిలో 27 ఆసుపత్రులు సేవలను నిలిపివేసినట్లు తెలిపారు. మిగిలిన 35 ఆసుపత్రుల్లో యధాతథంగా సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. పాత బకాయిలు ఉన్నమాట వాస్తవమేనన్నారు. అత్యవసర సేవలను కొనసాగించేలా ఆసుపత్రుల వారిని ఒప్పిస్తున్నామని అన్నారు.

రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ తగదు

- అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నిలిపివేయండి
- కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు లేఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెదగంట్యాడ వద్ద అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలన్న ప్రయత్నాలను విరమింపజేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు కోరారు. ఈ మేరకు విశాఖ జిల్లా కలెక్టర్‌కు ఆయన లేఖ రాశారు. ఆ వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పెదగంట్యాడ గ్రామం వద్ద అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఈ నెల 8న ఎపి కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. జనావాసాల మధ్య ఆ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల ఆరోగ్యాలకు తీవ్రహాని జరుగుతుందని వేలాది మంది ప్రజలు ఆ ఫ్యాక్టరీ ఏర్పాటును, ప్రజాభిప్రాయ సేకరణను తిరస్కరించారని జగ్గునాయుడు గుర్తుచేశారు. ప్రజలు వారి ఆగ్రహాన్ని తీవ్ర స్థాయిలో వ్యక్తం చేశారన్నారు. 'అదాని సిమెంట్ కంపెనీ వద్దు, మాకు స్వచ్ఛమైన గాలి, నీరు, భూమి, పర్యావరణం కావాలి' అని డిమాండ్ చేశారన్నారు. దీంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తొలుత అధికారులు ప్రకటించారన్నారు. కానీ 15 రోజుల తరువాత మరలా ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని అదే రోజు సాయంత్రం జిల్లా అధికారులు ప్రకటించడం ప్రజలను విస్మయపరిచిందన్నారు. జనావాసాల మధ్య పెదగంట్యాడలో ఈ సిమెంట్ కంపెనీ ఏర్పాటు వద్దే వద్దని వేలాది మంది ప్రజలు ముక్తకంఠంతో తిరస్కరించినా రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని అధికారులు ప్రకటించడం ప్రజాభిప్రాయాన్ని తుంగలో తొక్కడమే అవుతుందని, సిపిఎం దీనిని తీవ్రంగా నిరసిస్తోందని తెలిపారు. 8న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ఏర్పాట్లకు పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని వినియోగించారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధికార యంత్రాంగం సహా వందలాది మంది పోలీసు సిబ్బంది, వాహనాలను దీనికి ఉపయోగించారని తెలిపారు. ప్రజలు తమ ఉపాధి, పనులు వదులుకొని హాజరయ్యారన్నారు. ప్రజాభిప్రాయం స్పష్టంగా వెలువడ్డాక కూడా మరలా ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రజాధనాన్ని, సమయాన్ని, అధికారులు, పోలీసు యంత్రాంగం సేవలను దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. అదాని ప్రయోజనాల కోసం లక్షలాది మంది ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టడానికి ప్రభుత్వం పూనుకోవడం ప్రజావ్యతిరేక చర్య అవుతుందని తెలిపారు. ఇఐఎ రిపోర్టు ప్రకారం సిమెంట్ ఫ్యాక్టరీ ఉత్పత్తి క్రమంలో కేవలం 260 మందికి మాత్రమే ఉపాధి లభిస్తుందని, లక్షలాది మంది ప్రజలకు, మిగతా 2లో..

బకాయి జీతాలపై సినర్జీస్ కార్మికుల ధర్నా

వార్త 2లో..

కార్మికులకు పని గంటల పెంపు దుర్మార్గం

వార్త 8లో..

స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం

వార్త 3లో..



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ఇంటి దొంగ పనే..!

'కంచరపాలెం' చోరీ కేసును ఛేదించిన పోలీసులు

వార్త 3లో..

బోధనేతర పనుల బహిష్కరణ

పలుచోట్ల అధికారులకు ఉపాధ్యాయుల వినతులు



అనకాపల్లి డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - అనకాపల్లి, విశాఖ కలెక్టరేట్, రావికమతం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనులను ఉపాధ్యాయులు శుక్రవారం బహిష్కరించారు. విశాఖ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో విశాఖ జిల్లా చైర్మన్ కేశవరావు, సెక్రటరీ జనరల్ ధర్మేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లాలో డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బోయిన చిన్నారావు, సెక్రటరీ జనరల్ యేశపోగు సుధాకర్‌రావు, కో చైర్మన్ ఆళ్ల శేఖర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ - 1 సిరికి దుర్గాప్రసాద్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ - 2 ఆచంట రవి, కార్యవర్గ సభ్యులు చల్ల నాగేశ్వరరావు, గాయత్రి పాల్గొన్నారు. ఆయాచోట్ల వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, మిగిలిన కార్యక్రమాలు అప్పగించరాదని అన్నారు. పలుమార్లు ఈ విషయాన్ని ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే ఈ విషయమై ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్‌లో భారీ ఆందోళన చేపట్టామని గుర్తుచేశారు. రావికమతం మండలంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పారావు, నాగేశ్వరరావు, ఎపిటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు హరి ప్రసాద్, సుధీర్ సాయిలు మండల విద్యాశాఖ అధికారి ఎం.లింగమూర్తికి వినతిపత్రం అందజేశారు.

చిరు వర్తకుల ఉపాధికి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చిరు వర్తకుల ఉపాధికి రక్షణ కల్పించాలని, రోడ్ల పక్కన, ఫుట్‌పాత్ మార్జిన్‌లో చిన్నపాటి వ్యాపారులు చేసుకుంటున్న పేదలపై దాడులు, దౌర్జన్యాలు ఆపాలని కోరుతూ విశాఖ జిల్లా తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంఘం ఆధ్వర్యాన శుక్రవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా వెంకోజీపాలెం బస్ స్టాప్ నుంచి ఇసుకతోటలోని గంటా కార్యాలయానికి బయలుదేరారు. పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ఎంవిపి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపైనే చిరు వ్యాపారులు బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఎమ్మెల్యే గంటా కల్పించుకుని జివిఎంసి కమిషనర్, ఇతర అధికారులతో చర్చించి తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు ముద్దిలపాలెం జోన్ ప్రధాన కార్యదర్శి పి.వెంకటరావు, తోపుడు బండ్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం, సిఐటియు మధురవాడ జోన్ నాయకులు పి.రాజు కుమార్ మాట్లాడారు. తోపుడు బండ్ల కార్మికులను 23 రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా ప్రతినిధులు ఎవరూ లేని కాలంలో అధికారులు దాడులు చేసి వారిని తీవ్రంగా నష్టపరిచారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌ఛార్జికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు, నాయకులు ఎస్.ఆదినారాయణ, కె.సురేష్, వరలక్ష్మి, ధనుంజయరావు, పి.నారాయణ, ఎ.రఘు, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.



గంటా ఇంటి వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

మొదటి పేజీ తరువాయి..

రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ తగదు

పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతుందని జగ్గునాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో వెంటనే కలుగజేసుకొని రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణ కోసం జరుగుతున్న ప్రయత్నాలను విరమింపజేసేందుకు, ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న యుజిడి కార్మికులు

సమస్యలపై యుజిడి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో యుజిడి కార్మికులు మోకాళ్లపై నిల్చొని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, యుజిడి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఇ.ఆదినారాయణ మాట్లాడుతూ యుజిడి వర్కర్స్ 13 మందికి జిఒ 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిఒ వచ్చి సంవత్సర కాలం అవుతున్నప్పటికీ అర్హులైన కార్మికులకు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. అలాగే 315 మంది కార్మికులకు 7 నెలలు, 10 నెలలు ఎరియర్స్ చెల్లించాలన్నారు. సేఫ్టీ పరికరాలు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో మరోసారి సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సతీష్, సింహాచలం, నరేష్, అంజి, సీతంనాయుడు, మహేష్, లక్ష్మి, వెంకటేష్, అప్పలరాజు, గణపతి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సినర్జీస్ కార్మికులు

బకాయి జీతాలపై సినర్జీస్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సినర్జీస్ కార్మికులకు బకాయి ఉన్న ఐదు నెలల జీతాలు చెల్లించాలని సినర్జీస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం జెసిఎల్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా పనిచేస్తారని, వారి కుటుంబ పోషణ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. దసరా దీపావళి వంటి పండగల సమయంలో కూడా జీతాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. అనంతరం జెసిఎల్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనికి ఆయన స్పందించి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు జాయింట్ మీటింగ్ వేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి ఎ.దాసు, బషీర్, సత్యనారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

లింగేశ్వరరావుకు మేయర్ అభినందన



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల తైవాన్‌లో ముగిసిన ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖ నగరానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి బివిఎస్‌కె.లింగేశ్వరరావు రజక పతకాన్ని సాధించడంతో ఆయన్ని శుక్రవారం విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా 54 దేశాల నుంచి సుమారు 1700 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా లింగేశ్వరరావు అద్భుత ప్రతిభ కనబరిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో చెన్నైకి చెందిన సహచర క్రీడాకారిణి సుజన్ విన్గేటుతో కలిసి పతకాన్ని కైవశం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన్ని శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, అసోసియేషన్ కార్యదర్శి, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, 43వ వార్డు కార్పొరేటర్, జనసేన నాయకురాలు, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.ఉషశ్రీ అభినందించారు

హెచ్‌ఆర్ఎ మంజూరు చేయాలని ధర్నా



రిటైర్డ్ రైల్వే పెన్షనర్ల ఆందోళనకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెన్షనర్లకు, కుటుంబ పెన్షనర్లకు హెచ్‌ఆర్ఎ మంజూరు చేయాలంటూ విశాఖపట్నం రిటైర్డ్ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌వి.శేషాద్రి, కార్యదర్శి వి.నరసింగరావు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే ఫెడరేషన్ (ఎఐఆర్ఆర్ఎఫ్) ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం విశాఖలోని రిటైర్డ్ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిఆర్ఎం కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020 జనవరి 1 నుండి 2021 జూన్ 30 వరకు డిఎ, డిఆర్‌ను విడుదల చేయాలన్నారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను మెరుగుపరచాలన్నారు. ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పెన్షన్ వేలిడేషన్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

కిరణ్మయికి ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధక విద్యార్థిని ఊరందూరు కిరణ్మయికి వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆమె ఎయు విసి ఆచార్య జిపి.రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆ విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ పి.అరుణ్ కుమార్ మార్గ దర్శకత్వంలో కిరణ్మయి పరిశోధనలు కొనసాగాయి.

'ఎ స్టడీ ఆన్ ఎమర్జింగ్ హెచ్‌ఆర్ ట్రెండ్స్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్ మెంట్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు కింగ్ జార్జ్ హాస్పిటల్ (కెజిహెచ్) అండ్ అపోలో హాస్పిటల్స్ ఇన్ విశాఖపట్నం' అనే అంశంపై చేసిన పరిశోధనలకుగాను ఆమె డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు ఆమెను అభివందించారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 15 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు శుక్రవారం 15 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ఓపెన్ ఫోరమ్‌ను నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోరాటంతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న హుస్సేన్

ప్రజాశక్తి-ములగాడ : పెన్షనర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో సిహెచ్ తమ్మారావు అధ్యక్షతన పారిశ్రామిక ప్రాంత ప్రాంతీయ పెన్షనర్స్ సమావేశంలో యూనియన్ ప్రతినిధులు కె. నూకరాజు, ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, విజయవాడలో జరిగిన సదస్సుకు జిల్లా నుండి 53 ప్రతినిధులు హాజరై విజయవంతం చేశారన్నారు. వచ్చేనెల 16న పెన్షనర్ల విద్రోహదినం నిర్వహించాల్సి ఉండగా, ఆ రోజు ఆదివారం కావడంతో ఎపుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు. 11న బెంగళూరులో జరగాల్సిన సిబిటి సమావేశాన్ని 13న ఢిల్లీకి మార్పు చేశారన్నారు పెన్షన్ పెంపుపై ప్రకటనలు వస్తున్నా అధికారిక సమాచారం లేదన్నారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన రెండురోజుల ధర్నాకు సిద్ధం కావాలన్నారు. పెన్షనర్లంతా సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు.

తమ్మిన పోతురాజుకు ఘననివాళి

ప్రజాశక్తి -మధురవాడ : విజయవాడ మాజీ ఎమ్మెల్యే తమ్మిన పోతరాజు113 వ జయంతి మధురవాడ సిపిఐ కార్యాలయం వద్ద రాష్ట్ర నగరాల వెల్ఫేర్‌చ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పోతురాజు చిత్రపటానికి నగరాల సామాజిక వర్గనేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో నగరాల సంఘం జిల్లా కార్యదర్శి జగపిళ్ల అప్పలరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు నాగోతి సూర్య ప్రకాశరావు,నాగోతి అనిత, పోతిన పైడిరాజు, వాంద్రాసి అప్పలరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, వాంద్రాసి సన్యాసిరావు, పిఎసిఎస్ చైర్‌పర్సన్ పోతిన ప్రసాద్, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకుడు నాగోతి శివాజీ, ఎన్ రాము, గూడెల కామేష్, పి ప్రసాద్, పిళ్ల కష్ణ, వి సత్యనారాయణ పాల్గొన్నారు.

జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో లైఫ్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి- మాధవధార : విశాఖపట్నం పోర్ట్, డిఎల్‌బి పెన్షనర్స్ జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్స్‌ను పొందాలని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్, బ్యాంకు అకౌంట్ నెంబర్, పిపిఓ నెంబరు ఉన్న పెన్షనర్లు, సిటిజన్స్ సర్వీస్ సెంటర్, బ్యాంక్స్, ఈసేవ, మీ సేవల ద్వారా లైఫ్ సర్టిఫికెట్స్‌ను పొందవచ్చని సూచించారు. అలాగే పోర్టు ఎఒబిలోని సాంబమూర్తి ఆడిటోరియంలో లైఫ్ సర్టిఫికెట్లను పొందవచ్చునని తెలిపారు.

అంగన్వాడీ భవనం ఆధునీకరణ

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59 వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో అంగన్వాడీ భవనం ఆధునీకరణ పనులను స్థానిక కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ సురేష్ ప్రారంభించారు. కార్పొరేటర్ కృషితో, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సహకారంతో కోరమండల్ కంపెనీ రూ.8లక్షలు సిఎస్‌ఆర్ నిధులు మంజూరు చేసింది. అంగన్వాడీ భవనానికి కొత్తగా అదనపు గది నిర్మాణంతోపాటు ఆధునీకరణ పనులు చేపట్టను న్నారు. నిధులిచ్చిన కోరమండల్ సంస్థకు, మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే గణబాబు, కార్పొరేటర్ పూర్ణశ్రీకి కూటమినేతలతోపాటు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోరమండల్ సిఎస్‌ఆర్ విభాగం మేనేజర్ వెంకటరమణ, రాజీవ్, వార్డు టిడిపి అధ్యక్షులు ఊరుకుటి హరిబాబ, డొంకాన రాంబాబు, లక్కరాజు రామకృష్ణ, అంజి, ఊరుకుటి.మహేష్, పెద్దాడ.తిలక్, సరోజిని తదితరులు పాల్గొన్నారు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



డిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పార్కుల్లో అక్రమంగా తొలగించిన గార్డెన్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని విఎంఆర్‌డిఎ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేసారు. సెంట్రల్‌పార్కు, కైలాస్‌గిరి, ఉడాపార్కు, తెన్నేటిపార్కులలో పనిచేస్తున్న 18 మంది కార్మికులను డిఎఫ్‌ఓ అన్యాయంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం అక్కయ్యపాలెం డిసిఎల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గార్డెన్ కార్మికులకూ లేబర్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ పర్యాటక కేంద్రాలుగా ఉన్న విఎంఆర్‌డిఎ పార్కుల్లో 7 సొసైటీలలో 250 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి కార్మిక చట్టాలు వర్తింపజేయాలని డిమాండ్ చేసారు. 35ఏళ్లుగాపనిచేస్తున్న 18 మంది కార్మికులను ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా తొలగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. అరవై ఏళ్లు నిండిన 11మందిని పదిరోజులు సెలవు పెట్టారనే కారణంతో మరో ఏడుగురు కార్మికులను తొలగించడం సరికాదన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవా లన్నారు. గార్డెన్ కార్మికులకు కనీస వేతనాలు, ఇఎస్‌ఐ, పిఎఫ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు సిహెచ్ దుర్గఅప్పారావు, సింహాద్రి, రాంబాబు, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

చురుగ్గా పైలాన్ ఆధునీకరణ

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఈ నెల 14నుంచి 16 వరకు ఎయులో నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సులో భాగంగా పైలాన్ ఆధునీకరణ పనులను జివిఎంసి ఆధ్వర్యంలో శరవేగంగా చేపడుతున్నారు. నాలుగో వార్డు తిమ్మాపురం నుంచి తొట్లకొండ వరకు రెయిలింగ్, పచ్చదనం పెంపుదల లాంటి పనులు చేపడుతున్నట్లు జెడ్‌సి ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. వచ్చేనెల 29,30 తేదీల్లో భీమిలి ఉత్సవ్ నేపథ్యంలో తీరాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనిలో వివిధ శాఖలు నిమగ్నమై ఉన్నాయి.

చారిత్రక ప్రదేశాల సందర్శన

ప్రజాశక్తి భీమునిపట్నం : ఆర్కిటెక్చర్ డే సందర్భంగా స్థానికంగా ఉన్న పలు పురాతన భవనాలను, చారిత్రక ప్రదేశాలను గీతం కళాశాల ఆర్కిటెక్చర్ ఫస్ట్, ఫైనలియర్‌విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. అసోసియేట్ ప్రొఫెసర్లు పి రవీంద్ర, జస్వంత్, హేమ, రవి కిశోర్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులు పురాతన పురపాలక సంఘ కార్యాలయం, చారిత్రక గంటస్తంభం తదితరకట్టడాలను పరిశీలించారు. పెన్సిల్ స్కెచింగ్ ద్వారా అప్పటి నిర్మాణ మెలుకవలను తెలుసుకున్నారు. భీమిలి చారిత్రక నేపథ్యాన్ని ప్రొఫెసర్లు వివరించారు

బీచ్‌లో పరిశుభ్రతా పనులు

భీమునిపట్నం : గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు శుక్ర వారం భీమిలి తీరంలో పరిసరాలను శుభ్రపరిచారు. స్థానిక టిడిపి నాయకులు గంటా నూకరాజు, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షులు కె చిన్నారావు, సాగర వికాస సహకార పొదుపు సంఘం సిఇఓ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గర్ల్ చైల్డ్ డే

ప్రజాశక్తి భీమునిపట్నం : పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్ర వారం గర్ల్ చైల్డ్‌డే నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గర్ల్ చైల్డ్ డే ప్రాముఖ్యతను హెచ్‌ఎం, పొన్నగంటి రమణ వివరించారు. వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు

స్థానిక దొరతోట రోడ్డు సెడార్ పాఠశాల ఆవరణలో గర్ల్ చైల్డ్‌డే సందర్భంగా బాలికా అక్రమ రవాణా, బాలికా కార్మికత్వం నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ రెస్క్యూ నేషనల్ ట్రైనీ డెవలప్మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ మా థ్యూ, సుహాసిని డేనియల్, సెడార్ పాఠశాల, జూనియర్, బిఇడి కళాశాల ఉపాధ్యాయులు, శిక్షణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఉల్లాసంగా 'బాసర' ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి-తగరపువలస : క్రమశిక్షణతో ఉన్నట్లైతే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని బాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ సూచించారు. శుక్రవారం బాసర జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డేను ఉల్లాసభరిత వాతావారణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకుని, పట్టుదలతో దాన్ని సాధించేందుకు కృషి చేయాలని, బాసర విద్యాసంస్థలు అందుకు పూర్తి సహకారానిన అందిస్తాయ న్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి కళాశాల జోనల్ ప్రిన్సిపాల్ వివిడి రమేష్, డిఫెన్స్ ప్రిన్సిపాల్ మహేశ్వరరెడ్డి, డీన్ మజ్జి భాస్కరరావు, అడ్వైజరీ మెంబర్ ప్రవీణ్, ఐఐటి కోఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు

స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం

టాస్క్‌ఫోర్స్ దాడిలో బట్టబయలు : ముగ్గురు నిర్వాహకులతోపాటు ముగ్గురు విటుల అరెస్ట్



స్పా సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



లెవిషీ స్పా సెంటర్

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్పాసెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారని అందిన సమాచారం మేరకు దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లెవిషీ హెయిర్ అండ్ బ్యూటీ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం సాయంత్రం ఆకస్మిక దాడులు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి. సిపి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిఐ, ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు, సిబ్బందితో లెవిషీ బ్యూటీ సెంటర్‌లో వ్యభిచారం జరుగుతున్న సమయంలో దాడిచేసి, సెంటర్ నిర్వాహకులకు సంబంధించి ముగ్గురిని, ముగ్గురు విటులు, ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు భాదిత మహిళలను సేఫ్ కస్టడీకి దువ్వాడ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. స్పాసెంటర్ నిర్వాహకులు కిల్లాడ ప్రవీణ్, యెజ్జపురపు దమయంతి కొసనం హైమావతిలతోపాటు వారికి సహకరిస్తున్న అమిత్ గౌతమ్‌ను అరెస్ట్ చేశారు. దీనిపై కేసు దర్యాప్తు అనంతరం వ్యభిచారం నిర్వహిస్తూ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు నగరంలో స్పా సెంటర్‌లలో అనధికారిక వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అనుమానం ఉంటే నేరుగా డయల్ 100, 112కు గాని, లేదా నగర పోలీస్‌కమిషనర్ ఫోన్ నెంబర్ 7995095799 గాని లేదా దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించి సహకరించాలని పోలీసులు కోరారు.

నేరాలు ఘోరాలు

ఇంటి దొంగ పనే..!

- 'కంచరపాలెం' చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 5న అర్ధరాత్రి కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ దొంగతనం కేసులో ఆ ఇంటి పెద్ద కొడుకే ప్రధాన నిందితుడని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఇంట్లో దోపిడీకి ప్రణాళిక రచించిన ఇంటి పెద్ద కుమారుడు ధర్మాల కష్ణకాంత్ సహా నలుగురిని అరెస్టు చేశామన్నారు. నిందితులు కంచరపాలెం ఇందిరానగర్‌లోని ఇంటి వెనకాల నుంచి తలుపులు పగలగొట్టి ప్రవేశించారని, అనంతరం ఇంటి సభ్యులను ప్లాస్టర్, ప్లాస్టిక్ ట్యాగ్ వైర్లతో కట్టి నిర్బంధించారని వెల్లడించారు. అక్కడి మహిళ ఒంటిపై ఉన్న సుమారు 12 తులాల బంగారంతో పాటు అదే ప్రాంతంలో ఉన్న సోదరుని చేతి నుండి డైమండ్ ఉంగరం, బీరువాలోని రూ.50 వేల నగదు దోచుకుని, ఇంటిముందు పార్క్ చేసి ఉంచిన కారులో పరారయ్యారని కమిషనర్ వివరించారు.

సీసీ కెమెరా ఫుటేజ్, మొబైల్ డేటా ఆధారంగా సాంకేతిక ఆధారాలు విశ్లేషించి ఈ దోపిడీ పక్కా ప్రణాళికతో జరిగిందని నిర్ధారణకు వచ్చామన్నారు. ప్రధాన నిందితుడు ధర్మాల కృష్ణకాంత్, పరపతి ప్రమోద్ కుమార్, షేక్ అభిషేక్, అవసరాల సత్య సూర్య కుమార్‌లను అరెస్టు చేశామన్నారు. నిందితుడు కృష్ణకాంత్ తండ్రి వలే వ్యాపారం చేయాలని ఆన్‌లైన్ ట్రేడింగ్ చేసి భారీ నష్టాల పాలయ్యాడని, అప్పులు తీర్చేందుకు స్నేహితులతో కలిసి సొంత ఇంటిలోనే దొంగతనం చేయాలని ప్రణాళిక వేశాడన్నారు. నిందితుల నుంచి 12 తులాల బంగారం రూ. 2.10 లక్షల నగదు, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. మీడియా సమావేశంలో క్రైమ్ డిసిపి లతా మాధురి, ఈస్ట్ ఎసిపి నరసింహమూర్తి, సిఐ మీసాల చంద్రమౌళి, ఎస్‌ఐ అబ్దుల్ మహరూఫ్ పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే జగన్ నాటకాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : రాజకీయ లబ్ధి కోసమే వైసిపి అధినేత జగన్ ప్రజలను మభ్యపెట్టాలని నాటకాలాడుతున్నారని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ధ్వజమెత్తారు. పిపిపికి, ప్రయివేటీకరణకు తేడా జగన్‌కు తెలియదని, అందుకే మెడికల్ కాలేజీలు ప్రయివేటుపరం చేస్తున్నారంటూ రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం సీతంపేట జనసేనకార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీలకు జగన్ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టిందో చెప్పాలన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను సైతం దారిమళ్లించి, వ్యాపార ధోరణిలోనే ఐదేళ్ల పాలన సాగించి, వైద్యకళాశాలను నిర్వీర్యం చేసిన జగన్, ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యలు ఆగాయన్నారు కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమంతో తనకు మనుగడ ఉండదనే భయంతో ఉనికికోసం జగన్ ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వసంత లక్ష్మీ, కందుల నాగరాజు, మాసిపోగు రాజు, అక్కిరెడ్డి జగదీష్, శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆర్జిత సేవల్లో భాగంగా శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసిన అర్చకులు, పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కల్యాణతంతు కమనీయంగా జరిపించారు. పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేశారు. అనంతరం అంతరాలయ దర్శనం కల్పించారు.

ఘనంగా చందనోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార.: జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా చందనోత్సవం నిర్వహించారు. మస్జీద్ ప్రాంగణంలో స్థానిక ముస్లిములు ఖురాన్ పఠించారు. మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో చిన్నారులు, ముస్లిం మత గురువులు నాతే కలాం ఆలపిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలనీ హజ్రత్ గౌస్ ఫాక్ నిషాని షరీఫ్ వద్ద ఫాతిహా నిర్వహించి బావుటా పవిత్ర వస్త్రం'సమర్పించారు. మస్జిద్ కమిటీ అధ్యక్షులు మున్నా, ఉర్స్ కమిటీ సభ్యులు లతీఫ్ పర్యవేక్షించారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ములగాడ : ఈనెల 13,14,15 తేదీ అనంతపురంలో నిర్వహించే ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ నేతలు కోరారు. శుక్రవారం 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఐద్వా పతాకాన్ని రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఆర్ విమల, ఏరియా కమిటీ అధ్యక్షురాలు బూడి రమ ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా ఆర్ విమల మాట్లాడుతూ మహిళా సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి, రాబోయే మూడేళ్లకు భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి బూడి జ్యోతి, రమ్య, సత్యవతి, పూడమ్మ, రామ విజయలక్ష్మి పాల్గొన్నారు.



ములగాడలో ఐద్వా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

మాధవధార : ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో తోటవీధిలో ఐద్వా జెండాను ఆవిష్కరించారు. సుభాష్‌నగర్,బర్మా క్యాంపు తదితర ప్రాంతాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బొట్ట ఈశ్వరమ్మ మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల మహిళలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహాసభలకు ప్రాధాన్యత ఉందని, అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.కార్యక్రమంలో సిహెచ్. కమలమ్మ, పాపమ్మ, హేమలత పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: అనంతపురంలో ఈనెల 13, 14, 15 తేదీలలో ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నర్సీపట్నం డివిజన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా నర్సీపట్నం కొత్త వీధి ఐద్వా యూనిట్‌లో పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా నాయకులు ఎల్.గౌరీ, కెవి. సూర్యప్రభ మాట్లాడుతూ, ప్రభుత్వాలు మారుతున్నా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మద్యం, మత్తు పదార్థాలపై విమర్శలు చేసిన నేతలు ఇప్పుడు ప్రతి వీధి గ్రామంలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి ప్రజలను మత్తు బారిన పడేస్తోందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పతాకావిష్కరణలో పాల్గొన్న మహిళలు

సిజెఐపై దాడి దారుణం



నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై దాడికి వ్యతిరేకంగా శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్థానిక బిర్లా జంక్షన్ వద్ద నిర్వహించిన నిరసనలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, సిజెఐపై దాడికి ఉన్మాద ఎజెండా కారణమని, దీనికి ప్రధాని మోడీ పూర్తి బాధ్యత వహించాలన్నారు. పెచ్చరిల్లుతున్న మతోన్మాదాన్ని ఐక్యంగా పోరాడి అడ్డుకుందామని పిలుపునిచ్చారు. సిజెఐపై దాడి దేశ రాజ్యాంగంపై దాడేనని, దేశ భవిష్యత్తుపై మతోన్మాదుల హెచ్చరికను తెలియజేస్తుందన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సనపల శ్రావణ్ మాట్లాడుతూ సిజెఐపై మతోన్మాద దాడిని ఖండించారు. డివైఎఫ్ఐ నాయకులు అనిల్, శరత్, అప్పలరాజు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సి ఉపాధ్యక్షురాలిగా రాధాకుమారి



రాధాకుమారి

ప్రజాశక్తి- భీమునిపట్నం : హ్యూమన్ రైట్ సెల్ (హెచ్‌ఆర్‌సి) ఉపాధ్యక్షురాలుగా అక్కయ్యపాలెం జివిఎంసి ఉన్నత పాఠశాల హెచ్ఎం జయంతి రాధాకుమారి నియమితులయ్యారు. సంస్థ జాతీయ అధ్యక్షులు రామకృష్ణ నియామకపత్రం అందజేశారని ఆమె తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన హెచ్ఆర్‌సిప్రతినిధులకు ధన్యవాదాలుతెలిపారు. రాధాకుమారికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథం తదితరులు అభినందించారు

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు



విద్యార్థులకు పుస్తకాలు ఇస్తున్న హెచ్ఎం, దాత పండరీనాథ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎన్ఎంఎం ఎస్ పరీక్షకు హాజరు కానున్న జివిఎంసి ఎంఏపి యుపి పాఠశాల కు చెందిన 20 మంది 8వ తరగతి విద్యార్థులకు శుక్ర వారంఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. స్వచ్ఛంద ఉపాధ్యాయులు జి పండరీనాథ్ తన సొంత నిధులతో సమకూర్చిన పుస్తకాలను హెచ్ఎం, మరగడ రామకృష్ణ, ఇతర ఉపాధ్యాయులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దాత పండరీనాథ్‌ను హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

భూముల రీసర్వే ఇప్పుడొద్దు!

ప్రజాశక్తి-పద్మనాభం : పంటపొలాల్లో ఖరీఫ్ సీజను పైర్లు ఉన్న నేపథ్యంలో సమగ్ర భూరీసర్వేను ఇపుడు నిర్వహించొద్దని, పాండ్రంగి రైతులు కోరారు. ఒకటిరెండు నెలల్లో పంట సీజన్ ముగిసి, పొలాలన్నీ ఖాళీగా ఉన్నపుడు రీసర్వే చేస్తే పంటలకు నష్టం కాకుండా సరిహద్దుల నిర్ధారణకు బాగుంటుందని సూచించారు. శుక్రవారం మండలంలోని పాండ్రంగి గ్రామంలో తహశీల్దార్ ఆనందరావు ఆధ్వర్యంలో భూముల రీసర్వేకు గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రస్తుతం రీసర్వే నిర్వహణకు సహకరించాలన్న అధికారుల సూచనకు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పొలాల్లో పైర్లు ఉండడంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో నిండి ఉన్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో సక్రమంగా భూసర్వే చేయడం సాధ్యం కాదని, కొన్నాళ్లు వాయిదా వేసి తర్వాత నిర్వహించాలని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఆనందరావుకు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.

కొయ్యపేటలో కెజిహెచ్ వైద్యుల బృందం



వ్యాధి పీడితులతో మాట్లాడుతున్న కెజిహెచ్ వైద్యులు

ప్రజాశక్తి -పద్మనాభం : వాంతులు, విరేచనాలతో పలువురు అస్వస్థతకు గురైన మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ కొయ్యపేట గ్రామాన్ని శుక్రవారం విశాఖపట్నం కెజిహెచ్ నుంచి రాపిడ్ రెస్పాన్స్ బృందం సందర్శించి, పరిశీలించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో కెజిహెచ్ జనరల్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ ఎంఫాతిమా. మైక్రో బయాలజీ విభాగం నుంచి శిరీష, జిల్లా ఎపిడమిక్ సెల్ నుంచి నారాయణరావు పాల్గొని, కొయ్యపేటలో ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. వ్యాధి పీడితులతో మాట్లాడి, కారణాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి వనరులకు పరిశీలించి, వాటిల్లో ఎటువంటి లోపం లేదని ప్రాథమికంగా నిర్ధారించారు. దసరా సందర్భంగా మాంసాహారం తీసుకోవడం వల్ల అజీర్ణసమస్యతో వాంతులు, విరోచనాలు వచ్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సమగ్ర పరిశీలన తర్వాత దీనిపై డిఎంహెచ్ఒకు నివేదిక అందజేస్తామని వైద్యుల బృందం స్పష్టం చేసింది. గ్రామంలో ప్రస్తుతమున్న 17 మంది వ్యాధిపీడితులు కోలుకుంటుండగా, కొత్తగా కేసులు నమోదు కాలేదు. కార్యక్రమంలో రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ లీలాప్రసాద్, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

5న ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చేనెల 5న రోటరీ క్లబ్ సౌజన్యతో రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణ తెలిపారు. శుక్రవారం అక్కయ్యపాలెంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, బ్రాడ్‌కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇళ్లస్థలాలు, పెన్షన్ సదుపాయం కల్పన, తదితర 11 ప్రధానమైన జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాంతాల వారీగా మంత్రులకు మరోసారి వినతి పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. విశాఖ జిల్లాకార్యదర్శి జి.శ్రీనివాస్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి. రవికుమార్.. పి.ఎస్.ప్రసాద్ ఉపాధ్యక్షులు బి శివప్రసాద్, ఎన్ రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ నగేష్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆనంద్ ..ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు,కార్యదర్శి మదన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డి.చక్రధరరావు, హరి, కెవి శర్మ , రాజశేఖర్ పాల్గొన్నారు

తర్లువాడ దళిత రైతుల ధర్నా

గూగుల్ డేటా సెంటర్‌కు భూములివ్వబోమని స్పష్టీకరణ

ప్రజాశక్తి-ఆనందపురం : గూగుల్ డేటా సెంటర్‌కు తమ సాగుభూములను ఇచ్చే ప్రసక్తే లేదని తర్లువాడ దళిత రైతులు స్పష్టం చేశారు. తమభూములను బలవంతంగా లాక్కోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని నిరసిస్తూ శుక్రవారం సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంసిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్. మూర్తి మాట్లాడుతూ దశాబ్దాలుగా 48 దళిత కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న సాగు భూములను గూగుల్ సెంటర్‌కు తీసుకోవాలనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వానికి కావాలంటే వేరేచోట భూములను సేకరించాలన్నారు. ఈ మేరకు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్.అప్పల నాయుడు, భీమిలి మండల సిఐటియు అధ్యక్షులు నేలత్ రాము, నాయకులు పోతరాజు నర్సింగరావు, గణేశ్, కొండమ్మ పాల్గొన్నారు.



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న తర్లువాడ దళిత రైతులు

దొంగ ఓట్లతో ప్రజాస్వామ్యం ఖూనీ



సంతకాల సేకరణలో కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : దేశంలో తీవ్రంగా ఉన్న దొంగ ఓట్ల ప్రభావంతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని కాంగ్రెస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న అన్నారు. ఎన్నికల్లో దొంగ ఓట్ల ప్రభావాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ నిరోధించాలని కోరుతూ శుక్రవారం పెందుర్తి అంబేద్కర్ విగ్రహం వద్ద పెందుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ కన్వీనర్ విన్నకోట రాము ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్క రామునాయుడు, ఆర్ఆర్ నాయుడు, గండి సన్నిబాబు,నక్క భీమారావు, పిడిది ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో ఘనంగా సాంకేతికోత్సవం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం నడిపల్లి సత్యనారాయణ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) ఆధ్వర్యంలో రెండురోజుల జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం 'టెక్నిమ్బుల్ 2025'ను శుక్రవారం విజయనగరం జెఎన్‌టియు జివి అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. చంద్రభూషణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తాజా సాంకేతిక పరిజ్ఞానం, సజనాత్మక ఆలోచనలు, పరిశోధనా దక్షతం పెంపొందించుకోవాలని సూచించారు. ఉత్సవంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుండి 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోస్టర్,పేపర్ ప్రెజెంటేషన్లు, టెక్నికల్ హంట్, డ్రోన్ ఎక్స్‌పో, ఫిల్మ్ మేకింగ్, సైబర్ సెక్యూరిటీ ప్రదర్శనలు వంటి విభిన్న పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శంభుప్రసాద్, చీఫ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ పిఎస్. రాజు, ట్రెజరర్ ఎన్. కనకరాజు, కన్వీనర్ డాక్టర్ కె.శ్రీధర్, కోకన్వీనర్ డాక్టర్ పి.ఎన్.ఈ. నవీన్ పాల్గొన్నారు.

మహిళలకు సఖి సురక్ష వైద్యసేవలు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరోవార్డు పి.ఎం.పాలెం సామాజిక భవనంలో శుక్రవారం సఖి సురక్షలో భాగంగా మహిళలకు ఉచిత వైద్యసేవలు అందించారు. ఏడోవార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ జెడ్‌సి కనకమహాలక్ష్మి, ఐదవ వార్డు అధ్యక్షులు సత్యనారాయణ, గారే గురునాథ్, నమ్మి రమణ, దాసరి శ్రీనివాస్, సూర్యప్రకాష్, పైడిరాజు,నాగోతి నరసింహ నాయుడు, కూటమి నేతలు పాల్గొన్నారు.

పాడి రైతులపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువుల పెంపకంపై శ్రద్ధ చూపించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని చౌడువాడలో రెండో విడత మంజూరు చేసిన గోకులం షెడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన గోకులం పథకాన్ని తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్తగా పశువుల షెడ్లకు నిధులు మంజూరు చేసిందన్నారు. మూడు పశువులు ఉన్నవారికి రూ.1,80,000 నాలు గు పశువులు ఉన్నవారికి రెండు లక్షల రూపాయల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులు ఈ పథకాన్ని వినియోగిం చుకోవాలని కోరారు. డ్వామా పిడి పూర్ణిమాదేవి మాట్లాడుతూ కే.కోటపాడు మండలంలో మొదటి విడత మంజూరు చేసిన 54 షెడ్లను పూర్తి చేయడం జరిగిందని రెండో విడతగా 72 షెడ్లకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని త్వరగా పూర్తిచేయాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఎపిడి శ్రీనివాసరావు ఎంపిడిఒ సాంబశివరావు ఎన్ఆర్ఈజీఎస్ ఎపిఒ అప్పలరాజు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారు


శ్రీవైష్ణవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఆల్ ఇండియా అంతర్ విశ్వ విద్యాలయాల యోగా పోటీలకు శ్రీవైష్ణవి

ప్రజాశక్తి-అనకాపల్లి: ఈ నెల 9వ తేదీన జరిగిన జెఎన్‌టియు జి.వి అంతర కళాశాలల యోగ పోటీల్లో స్థానిక దాడి ఇనిస్టిట్యూట్‌లో బిటెక్ చదువుతున్న సిఎస్ఎం విద్యార్థిని ఎం. శ్రీ వైష్ణవి గోల్డ్ మెడల్ సాధిం చి, నవంబర్ 24 నుండి 28 తేదీల్లో బెంగళూరు స్వామి వివేకానంద యోగ అనుసంధానం సంస్థాన యూనివర్సిటీలో నిర్వహించనున్న యోగా పోటీలలో పాల్గొంటున్నట్లు కళాశాల పిడి శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఆర్ .వైకుంఠరావు, డీన్ అకాడెమిక్స్ డాక్టర్ వి.ఫణి బాబు, సిఎస్ఎం విభాగాధిపతి గోపాలమ్మ సిబ్బంది ఆమెను అభినందించారు.


మాట్లాడుతున్న కూటమి నాయకులు

రహదారుల నిర్మాణాలకు నిధులు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చొరవతో మండలంలోని తుమ్మపాల, దిబ్బపాలెం, ఊడేరు రోడ్డుకు మూడు కోట్లు నిధులు మంజూరయ్యాయని కూటమి నాయకులు పేర్కొన్నారు. స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తుమ్మపాల నుండి దిబ్బపాలెం మీదగా ఊడేరు మీదగా మెయిన్‌రోడ్డుకు రోడ్లు భవనాల శాఖ ద్వారా నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రజల అభ్యర్థన మేరకు ప్రభుత్వానికి సిఫార్సు చేయడం ద్వారా ఈ నిధులు మంజూరయ్యా యన్నారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన కొణతాల రామకష్ణకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), జనసేన మండల నాయకులు గంగుపాము జగదీష్, దిబ్బపాలెం సర్పంచ్ పీలా ఉషా అప్పారావు, కర్ణం రాము, మాకవరం సర్పంచ్ మొయ్య నూకరాజు, ఊడేరు సీనియర్ నాయకులు, పాల సొసైటీ అధ్యక్షులు ఇంటి తాతారావు, సిరిగిరిశెట్టి రాజేష్, మాజీ వైస్ ప్రెసిడెంట్స్ సిరిగిరి శెట్టి రాజు, ఆళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమంలో విఫలం

ప్రజాశక్తి -పరవాడ : అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో అనంతపురంలో నిర్వహిస్తున్న సభలు విజయవంతం చేయాలని ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం, జిల్లా జాయింట్ సెక్రటరీ తుంపాల అన్నపూర్ణ, మండల అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ పిలుపునిచ్చారు. పరవాడ టిడ్కో కాలనీలో శుక్రవారం జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఐద్వా సీనియర్ నాయకురాలు కే.వరలక్ష్మి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం తీసుకున్న సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని విమర్శించారు. మహిళల రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.


టిడ్కో కాలనీలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

13 గంటల పనివేళలను రద్దు చేయాలని, 18 సంవత్సరాలు దాటిన యువతులకు హామీ ఇచ్చిన రూ.1500ను బ్యాంకుఖాతాల్లో జమ చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. కార్యక్రమంలో అరుణ, వరలక్ష్మి, బేగం, లక్ష్మి, అనసూయ, కృప, డి.లక్ష్మి, గోపాలరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

శ్రీకాళహస్తి బోర్డు డైరెక్టర్ స్రవంతికి సత్కారం

ప్రజాశక్తి-మునగపాక: ఇటీవల శ్రీకాళహస్తి బోర్డు డైరెక్టర్‌గా నియమింపబడిన స్థానిక తెలుగు మహిళ స్రవంతిని టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్రవంతి దంపతులు మాట్లాడుతూ దళిత మహిళనైనా తనకు కాళహస్తి బోర్డు డైరెక్టర్ పదవి రావడానికి కారకులైన నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెంటకోట విజయ్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, కాండ్రేగుల శంకర్, మద్దాల కృష్ణ, సూరిశెట్టి అప్పలనాయుడు, పోలమరశెట్టి మోహన్‌రావు, మహిళా అధ్యక్షురాలు రేపాక మాలతి, దాడిశివ, దొడ్డికృష్ణ, ఆడారి జగన్నాధరావు పాల్గొన్నారు.



స్రవంతిని సత్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంజెపిబిసిడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థినులు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని తానాం గ్రామంలోని ఎంజెపిఎపిబిసిడబ్ల్యూఆర్ స్కూల్ అండ్‌జూనియర్ కాలేజ్ విద్యార్థినులు ఇటీవల నిర్వహించిన అండర్-19 ఎస్‌జిఎఫ్ బాలికల బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గోపాలపట్నం ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 9న జరిగిన అండర్-19 బాలికల బ్యాడ్మింటన్ పోటీల్లో డి. భవ్యశ్రీ (సినియర్, ఎంఈసి), వి. రమ్య (జునియర్ ఎన్‌పిసి), ఎం. రోషిణి (సినియర్, ఎంఈసి) తమ ప్రతిభతో స్టేట్ లెవల్ పోటీలకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 20న అనకాపల్లి ఎఎంఎఎల్ కాలేజీలో జరిగిన అండర్-19 బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్.మీకా (జావెలిన్ త్రో, హైజంప్, షాట్‌పుట్), జి. రూప (డిస్కస్ త్రో), బి. మౌనిక (3 కిమీ రన్), బి. కావ్య (3 కిమీరన్), కె. తేజస్వి (రేస్‌వాక్), కె. శ్రీలక్ష్మి (రేస్‌వాక్), టి. ధాన్య (జావెలిన్ త్రో), ఎస్. శ్రావణి (లాంగ్ జంప్) అద్భుత ప్రదర్శనతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలు వెస్ట్ గోదావరి జిల్లా ఏలూరు సమీపంలోని పెదవేగి లోని ఏపి ఆర్ జూనియర్ కాలేజీలో జరగనున్నాయని క్రీడా అధికారులు తెలిపారు. విద్యార్థినుల విజయంపై పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని, ఎటిపి చంద్రకళ, పిఈటి ఎస్.గౌరి హర్షం వ్యక్తం చేశారు.

కిశోర బాలికలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పరవాడ: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ముత్యాలమ్మపాలెం జెడ్‌పి హైస్కూల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ హెచ్.వి.రమణి సర్పంచ్ సుజాత బాలికలకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, చదువులో శ్రద్ధ, బాల్య వివాహాలను నివారించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆటలు ఆడారు.


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమణి

హెచ్‌ఎంలు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబు పాలనలో రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి -అచ్యుతాపురం: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పాలనలో అభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర రహదారులు అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 సంవత్సరాలు పదవీకాలం పూర్తి చేసిన సందర్భంగా అచ్యుతాపురం టిడిపి కార్యాలయంలో శుక్రవారం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. ఎలమంచిలి నియోజక వర్గం టిడిపి కార్యాలయంలో కూడా కేక్ కట్ చేశారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బీమరశెట్టి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, శ్రీకాళహస్తి బోర్డు డైరెక్టర్ బీలా స్రవంతి, అచ్చుతాపురం మండల ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు, పోనమల్ల కొండబాబు, మద్దాలకృష్ణ, క్లస్టర్ ఇంచార్జ్ కాండ్రేగుల శంకర్ పాల్గొన్నారు.


ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ, ఎపిఒ

ఉపాధి వేతనదారులు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఉపాధి వేతనదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ శివప్రసాద్ నారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలో కొమాల్లపూడిలో ఉపాధివేతనదారుల ఇకెవైసి నమోదు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇకెవైసి నమోదు వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో 20574 జాబ్‌కార్డులు ఉన్నాయని, 13459 కార్డులకు ఇకెవైసి పూర్తయిందన్నారు. కార్యక్రమంలో ఏపిఒ వరహాలుబాబు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విఒఎల కాలపరిమితి సర్క్యులర్ నిలిపివేతపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : డ్వాక్రా వెలుగు విఒఎ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)లు మూడు సంవత్సరాల కంటే ఎక్కువ ఉండకూడదని గత ప్రభుత్వం తీసుకొచ్చిన సర్క్యులర్‌ను నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సర్ఫ్ డిపార్ట్మెంట్ తీసుకున్న నిర్ణయంపై ఎపి వెలుగు విఒఎ యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) అనకాపల్లి జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వి.వి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రూపాదేవి, ఎస్.వెంకటలక్ష్మి మీడియాతో మాట్లాడారు. సర్క్యులర్ రద్దు చేయాలని ఆరేళ్లుగా సుదీర్ఘ పోరాటాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంబంధిత శాఖ మంత్రి సర్క్యులర్ నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. మిగిలిన సమస్యల పట్ల కూడా ప్రభుత్వ సానుకూలంగా స్పందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

మునగపాక: డ్వాక్రా వెలుగు విఒఎ (విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్) లు మూడు సంవత్సరాల కంటే ఎక్కువ ఉండకూడదని గత ప్రభుత్వం తీసుకొచ్చిన సర్క్యులర్‌ను నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, సర్ఫ్ శాఖ ఈనెల 9 న తీసుకున్న నిర్ణయం పట్ల ఎపి వెలుగు విఒఎ యానిమేటర్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) మునగపాక కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని గత ఆరేళ్లుగా సుదీర్ఘ పోరాటాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం హామీ మేరకు సర్క్యులర్ నిలుపుదల చేస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల అభినందనలు తెలియజేశారు. మిగిలిన సమస్యల పట్ల కూడా ప్రభుత్వ సానుకూలంగా స్పందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పోలమరశెట్టి ఉషా, లక్ష్మి, దుంగ ధనలక్ష్మి, దాడి జగదీ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఎపి కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గండి బాబ్జి

ప్రజాశక్తి -సబ్బవరం: ఉచిత పశువైద్య శిబిరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండిబాబ్జి అన్నారు. మండలంలోని మొగలిపురంలో శుక్రవారం పశుసంవర్థకశాఖ పశు గణాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 46 పశువులకు గర్భకోశ చికిత్సలు, పేడ, రక్త పరీక్షలు,32 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వెయ్యడం జరిగిందని పశు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సబ్బవరం సహాయ సంచాలకులు డా.కె.ఉషాకుమారి, గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు , అంగటి నానీ తమరాన సత్యన్నారాయణ , మేడపాటి రాము, బైలపూడి రాంబాబు, పశువైద్యాధికారులు అరుణ, డాక్టర్ స్వర్ణలత, సహాయకులు త్రినాథ్, రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ మల్ల శంకర్ సిబ్బంది పాల్గొన్నారు.


జగన్ పర్యటన విజయవంతం

ప్రజాశక్తి-మునగపాక: మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో ఆదరణ నేటికీ తగ్గలేదని వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం మెడికల్ కాలేజీ పర్యటనకు విచ్చేసిన జగన్ మోహన్ రెడ్డికి కుండపోత వర్షంలో కూడా ప్రజలు నీరాజనాల పలకడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలకున్న విశ్వాసం, ఆత్మాభిమానం తేటతెల్లమవుతుందన్నారు. జగన్ పర్యటనను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం మెడికల్ కాలేజీ సందర్శించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు, నాయకులకు మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి వేలాది మంది తరలి రావడంతో విజయవంతం అయిందని, స్పీకర్ అయ్యన్నపాత్రుడు పోలీసుల ద్వారా ఆంక్షలతో కార్యక్రమానికి వస్తున్న ప్రజలను అడ్డుకున్నారని, అయినప్పటికీ విజయవంతం అయిందన్నారు. నోటీసులు ఇవ్వడం, బెదిరింపులకు గురిచేయడం చేసినప్పటికీ కూడా భారీ ఎత్తున ప్రజలు తరలి వచ్చారన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ, పోలీసులు సహకరించారని అందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఎస్‌ఇజెడ్ నిర్వాసితుల సమస్యల పరిష్కరిస్తానని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. మండలంలో చిప్పాడ గ్రామంలో శుక్రవారం 45 మంది నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనులకు భూములు ఇచ్చిన నిర్వాసితులందరికి న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షులు బి.రాందాస్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు రాజాన రామునాయుడు, ఎంపిటిసి సభ్యుడు రాజాన భాషా, బిజెపి ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు, గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులను అడ్డుకున్న భూకబ్జాదారులు

ప్రజాశక్తి- సబ్బవరం: మండలంలోని గొల్లల పాలెం గ్రామంలో ప్రభుత్వ గెడ్డవాగును దురాక్రమణ చేసి అక్రమంగా నిర్మాణం చేపట్టిన భూకబ్జాదారులను రెవెన్యూ అధికారులు అడ్డుకునేందు కు వెళ్లారు. గొల్లపాలెం పంచాయతీ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 249లో 69సెంట్లు ప్రభుత్వ గెడ్డవాగు ఉంది. ఈ గెడ్డవాగులో ఆ గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా దురాక్రమణ చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. అయితే గ్రామస్తుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు వెళ్లగా, రెవెన్యూ సిబ్బందిని భూకబ్జాదారులు అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏమీ లేక రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు. ఈ విషయమై స్థానిక ఆర్ఐ వీరయ్యను వివరణ కోరగా గొల్లపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 249 లో సుమారు 69 సెంట్లు ప్రభుత్వ గెడ్డవాగు తమ రికార్డులలో నమోదైందని, ఈ గెడ్డవాగులో గొల్లపాలెంనకు చెందిన కొంతమంది ఆక్రమణ చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, గతంలో ఆగస్టు 23న తాము ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అయితే కబ్జాదారులు మళ్ళీ ఆ భూమిలో నిర్మాణ పనులు చేస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు తాము అక్కడికి వెళ్లగా ఆక్రమణదారులు ఈ భూమి తమకు చెందినదని బుకాయిస్తూ, తాము ప్రైవేటు సర్వేయరుతో సర్వే నిర్వహిస్తామని, ప్రభుత్వ సర్వేయరుపై తమకు నమ్మకం లేదని బుకాయిస్తున్నారని తెలిపారు. సోమవారం మండల సర్వేయర్‌తో సర్వే చేయించి ఆ గెడ్డవాగులో అక్రమ నిర్మాణాలు తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట విఆర్ఓ దేముడుబాబు, సచివాలయం సర్వేయర్ దినేష్, ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ రాజు ఉన్నారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

- ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి- అనకాపల్లి: దీపావళి పండుగతో పాటు ఇతర వేడుకల సందర్భంగా బాణాసంచా నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లాలోని కోటవురట్ల మండలం, కైలాసపట్నం గ్రామం, కోనసీమ జిల్లా, రాయవరం మండలం, వి.సవరం గ్రామంలో చోటుచేసుకున్న ప్రమాదకర ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణ భద్రత కోసం బాణా సంచా తయారీ, నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించినా, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకుండా లేదా తగిన భద్రతా సిబ్బంది లేకుండా బాణాసంచా నిల్వ లేదా తయారీ జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనధికారిక బాణాసంచా తయారీ, నిల్వ లేదా విక్రయం జరుగుతున్నట్లు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 నంబర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- అనకాపల్లిరూరల్: పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. చోడవరం నుంచి అనకాపల్లి వస్తున్న బస్ స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని నాలుగు రోడ్ల కూడలిలో ఢీకొట్టగా మృతి చెందారు. దీంతో స్థానికులు బస్ డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలంటూ ధర్నాకు దిగారు. పోలీసులు సర్దిచెప్పినా వినకపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. మతుని వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-కే.కోటపాడు: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని హైస్కూలు, ఎలిమెంటరీ, గొల్లలపాలెం కేజీబీవీ విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించారు. యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో బాలికలకు వ్యాసరచన , ఉచ్చారణ , కల్చరల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారని ఐసిడిఎస్ పిఒ లలితకుమారి తెలిపారు.

తడిపొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలోని చినఅప్పన్న పాలెంలో తడి చెత్త పొడి చెత్త సేకరణపై డిప్యూటీ ఎంపిడిఒ లవరాజు శుక్రవారం గ్రామస్తులకు గ్రీన్ అంబాసిడర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేయాలని సూచించారు. సిబ్బంది సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అనంతరం సంపద తయారీ కేంద్రం పరిశీలిం చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉష, గ్రీన్ అంబాసిడర్స్ పాల్గొన్నారు.

'రబీ పంటలు రైతుకు లాభదాయకం'

ప్రజాశక్తి-అనకాపల్లి: రబీ పంటలతో రైతులకు ఎంతో లాభదాయకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహసంచాలకులు డాక్టర్ సిహెచ్. ముకుందరావు అన్నారు. పరిశోధన స్థానంలో శుక్రవారం శిక్షణ సందర్శన, రబీ సీడ్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి ముకుందరావు మాట్లాడుతూ ప్రతి ఏటా అక్టోబర్‌లో రబీ సీడ్‌డే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు, జీవన ఎరువులు, జీవ నియంత్రణ పురుగు మందులు పంపిణీ చేశారు. అనంతరం అభ్యుదయ రైతులను సత్కరించారు. కార్యక్రమంలో చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు రమణమూర్తి, శ్రీలత, విశాలాక్షి, చంద్రశేఖర్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల షాపు తనిఖీ

ప్రజాశక్తి - దేవరాపల్లి : రైతులు పంటల్లో సమస్య గుర్తించిన తర్వాత స్థానికంగా ఉన్న గ్రామ అసిస్టెంట్‌ని సంప్రదించి మందులు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్ వై కాంతమ్మ రైతులకు సూచించారు. స్థానిక పురుగుమందుల షాపును శుక్రవారం ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. షాప్‌లో వరి పంటకి సంబంధించి ఏయే మందులు ఉన్నాయి. అదేవిధంగా మందులు కొన్నతరువాత వారికి బిల్లు ఇవ్వాలని తెలిపారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- అనకాపల్లిరూరల్: సంక్షోభాలు ఎదుర్కొనడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగేశ్వరరావు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అనకాపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా చంద్రబాబు పనిచేశారన్నారు. నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోడి వెంకట్రావు, కుప్పిలి జగన్మోహన్ ,కాంగ్రెస్‌గుల సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ దాడి అప్పారావు

బధిరుల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- అనకాపల్లి: 'సైన్ భాష హక్కులు లేకుండా మానవ హక్కులు సాధ్యపడవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హైమావతి పేర్కొన్నారు. అంతర్జాతీయ బధిరుల వారోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్ లాంగ్వేజ్ ప్రాముఖ్యత, కమ్యూనికేషన్‌లోని అడ్డంకులను తొలగించే మార్గాలు, బధిరుల హక్కులపై అవగాహన పెంచే అంశాలపై దృష్టి సారించాలన్నారు.

కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, ఎన్టీఆర్ జిల్లా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, బధిరుల సంఘం జిల్లా సలహాదారు వి.లక్ష్మి, ఎన్‌సిడి మెడికల్ ఆఫీసర్లు, ఫిజియోథెరపిస్టులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ అందించారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి జ్యోతి సర్పంచ్ జయ రజని

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కశింకోట: పిహెచ్‌సి వైద్యులు చేపడుతున్న సమ్మెతో రోగులు అవస్థలు పడుతున్నారని కశింకోట మండల ఉపాధ్యక్షులు పెంట కోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయ రజని శుక్రవారం అన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యులు ప్రత్యామ్నాయం ఎలా అవుతారని, జిల్లా ఆసుపత్రి నుంచి ఒకటి రెండు రోజులు డిప్యూటేషన్ మీద పంపినా ప్రత్యామ్నాయం ఎలా అవుతుందని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించి వైద్యుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణలను తొలగించాలి

ప్రజాశక్తి-సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో గల బోడిమెట్ట ఆక్రమణలను వెంటనే తొలగించాలని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పిల్లల సోమేశ్వరరావు రెవెన్యూ అధికారులను కోరారు. రాయపుర అగ్రహారం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 60లో గల బోడి మెట్టలో తన భార్య పిల్లల లక్ష్మికి ప్రభుత్వం డీపట్టా ఒక ఎకరా బంజరుభూమి 2005లో మంజూరు చేసారని తెలిపారు. అప్పటినుండి తాము ఆ భూమిలో జీడిమామిడి తోట వేసి ఫలసాయం అనుభవిస్తున్నామన్నారు. అయితే కొంతమంది స్థానికులు తమ భూమిని ఆక్రమించుకుంటున్నారని ఈ విషయంపై సబ్బవరం తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినాని ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ: ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమం ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి ఎం.సరోజిని, ఎంపిడిఒ రమేష్, తహశీల్దార్ నాగరాజు, ఉప మండల పరిషత్ అధికారి మురళీధర్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్, జిఎస్‌టిఒ పి.అలివేణి హాజరయ్యారు. కార్యక్రమంలో సరైన ధరలపై అవగాహన కల్పించారు.

బల్క్ డ్రగ్ పార్కుతో పర్యావరణానికి ముప్పు

- 27వ రోజుకు చేరిన మత్స్యకారుల ఆందోళన



నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:బల్క్ డ్రగ్ పరిశ్రమ ఏర్పాటు చేసి మత్స్యకారుల జీవితాలను నాశనం చేయొద్దని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ అన్నారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శుక్రవారం నాటికి 27వ రోజుకు చేరింది. మత్స్యకారుల పోరాటానికి వీసం సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. మత్స్యకారులతో కలిసి బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మత్స్యకారుల ఉపాధికి, ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి భంగం కలిగించే బల్క్ డ్రగ్ ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల ప్రధాన వత్తి చేపలు వేటని, వారిని సముద్రానికి దూరం చేయొద్దన్నారు. ఇప్పటికే ఫార్మా కంపెనీల వ్యర్థ జలాలు సముద్రంలో కలవడం వల్ల మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకారులు ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. మత్స్యకారులు పోరాటానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, తమ పోరాటానికి సంఘీభావం తెలుపుతున్న నాయకుల పై పోలీసులు ఆంక్షలు విధించడం తగదన్నారు. కేసులు పెట్టడం, గృహ నిర్బంధాలతో తమ పోరాటాన్ని అణచి వేయాలని చూస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, మత్స్యకార నాయకులు బి.బాబ్జి, పిక్కి తాతీలు, ఎరిపిల్లి నాగేష్, కాశీరావు, మాధవ, వెంకటేష్, కోటయ్య,నాగరాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

దోమ తెరలను వినియోగించాలి

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని గొప్పూరు గ్రామంలో జిల్లా మలేరియా అధికారి వరహాలదొర ఆకస్మికంగా పర్యటించారు.దోమల నివారణకు మరింత జాగ్రత్తగా పని చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, దోమతేరలు వాడుకునే విధానంపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా చికెన్ గున్యా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒ సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి రమణ, హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ, నాని, ఎ ఎన్ ఎమ్ సుగుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి (మాజీ వైస్ ఛాన్సర్) ఆచార్య ముర్రు ముత్యాల నాయుడు సందర్శించారు. గ్రంథాలయానికి జనరల్ నాలెడ్జ్, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను శుక్రవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను కలిగి ఉండాలన్నారు. వాటిని నేరవేర్చుకునే విధంగా శ్రమించాలని సూచించారు. లక్ష్య సాధనకు ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి వి ఎస్ ఎస్ శాస్త్రి కళాశాలకు అత్యంత విలువైన పుస్తకాలను అందించిన ముర్రు ముత్యాల నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ అధ్యాపకులు పూడి సత్యనారాయణ, స్థానిక ఉపాధ్యాయులు కొండలరావు, వైస్ ప్రిన్సిపాల్ జి జయలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాలకు లేజర్ ప్రింటర్ వితరణ



ప్రింటర్‌ను ఇస్తున్న దాత

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లేజర్ ప్రింటర్‌ను శుక్రవారం రిటైర్డ్ హెల్త్ అండ్ మెడికల్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఎస్ అప్పలనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలకు ప్రింటర్ను అందించిన అప్పలనాయుడును అభినందించారు.

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం



నక్కపల్లిలో మాట్లాడుతున్న హెచ్ఎం సత్య కుమార్

ప్రజాశక్తి-నక్కపల్లి:విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొని, మానసిక ప్రశాంతతను అలవర్చుకోవాలని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్య కుమార్ అన్నారు. మండలంలో గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్య కుమార్ మాట్లాడుతూ, శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా, సామాజికంగా కూడా ధృఢంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పాఠశాల ప్రత్యేక బోధన ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ మాట్లాడారు.ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న పరీక్ష ఒత్తిడి సమస్య,ఆందోళన, నిద్ర భంగం వంటి సమస్యలనుఎదుర్కొనేందుకు పలు సూచనలు చేశారు.

సీతమ్మధార : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని శనివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎయు ఆర్ట్స్ కళాశాలలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 'సేవలకు ప్రాప్యత విపత్తులు అత్యవసర పరిస్థితులలో మానసిక ఆరోగ్యం' థీమ్‌తో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక, మనోరోగ నిపుణురాలు డాక్టర్. నిత్య పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం కస్తూర్బా పాఠశాలలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. . డిస్ట్రిక్ట్ కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆనందపురం : ప్రపంచ మానసిక ఆరోగ్యం దినోత్సవం సందర్భంగా మామిడిలోవ సచివాలయంలో వాసవ్య మహిళా మండలి, లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి సాంత్వన ప్రాజెక్టు కోఆర్డినేటర్ గోపీచంద్, పంచాయతి సెక్రటరీ సత్యప్రసాద్, నాయకులు బల్ రెడ్డి రమేష్, సీతారాముడు పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని కస్తూరిబా పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహనకు బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎస్ఎకోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బోసుబాబు, పాఠశాల చైర్మన్ శివాజీ, వైస్ చైర్మన్ మంగ అప్పన్న పాల్గొన్నారు. జిల్లా ప్రత్యేక కౌన్సిలర్లు బి. రమాదివ్య, మంగమ్మ, పాఠశాల ఇన్‌ఛార్జి శీల పాల్గొన్నారు.

మధురవాడ : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని గీతం వైద్య విజ్ఞాన సంస్థ ఆసుపత్రిలోని మానసిక వైద్య విభాగం విద్యార్థులు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిమ్‌సర్ మానసిక వైద్య విభాగం అధిపతి డాక్టర్ శ్రీకృష్ణ, సహాయ ప్రొఫెసర్లు డాక్టర్ నివేదిత వాసిరెడ్డి, క్లినికల్ సైకాలజిస్ట్ సావీ చావ్లా పాల్గొన్నారు. భీమిలి సిహెచ్‌సిలో నిర్వహించిన కార్యక్రమంలో. డాక్టర్ రమ్య స్పందన, డాక్టర్ గీతాంజలి పాల్గొని అవగాహన కల్పించారు.

సబ్బవరం: విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెంచుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి ఆర్ జయ ప్రకాష్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్యదినోత్సవం సందర్భంగా మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష జిసిడిఒ జమీమా, జిల్లా మెంటల్ హెల్త్ కెరీర్ కౌన్సిలర్స్, ప్రిన్సిపాల్ ఎ. మదుల, సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని హెచ్ఎం సత్యారావు తెలిపారు.శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దిబ్బిడిలో సహిత విద్య విభాగం కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు భీశెట్టి అప్పలరాజు, ఉపాధ్యాయులు మూర్తి , అప్పారావు, గౌరిభాయి, పద్మావతి పాల్గొన్నారు.

అనకాపల్లిరూరల్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని డిఎవి పాఠశాలలో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌టిఆర్. ఆసుపత్రికి చెందిన ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఎస్.కె.కాజా మోయుద్దీన్ అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం సి. మహాదేవ శాస్త్రి ఆధ్వర్యంలో జరగ్గా ఆదిత్య బిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మానసిక శాస్త్రవేత్త పి.సునీత రాణి, బి. అనిల్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు వి. ప్రభాకర్ , డి.వి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



క్యూలో ఉన్న రోగులు

ఏరియా ఆసుపత్రి కిటకిట

ప్రజాశక్తి-నర్సీపట్నం:నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి శుక్రవారం రోగులు తాకిడి కనిపించింది. ప్రతినిత్యం ఇక్కడ ఓపి 400 నుంచి 500 వరకు ఉండగా, మంగళవారం, శుక్రవారం రోజున రోగులు తక్కువగా వస్తూ ఉంటారు. శుక్రవారం రోగులు దాదాపు 350 వరకు వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా హాస్పటల్ సూపరింటెంట్ సుధా శారద మాట్లాడుతూ, రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు మందులను అందుబాటులో ఉంచామన్నారు.



తొలగించిన షాపు


చిరు వ్యాపారుల షాపుల తొలగింపు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ పరిధిలోని పెద్దబొడ్డేపల్లెలో రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంతో తమ జీవనోపాధిపై దెబ్బ పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు పక్కన సుమారు ఐదు దశాబ్దాలుగా కూరగాయలు, పండ్లు, టీ తిను బండారాలు విక్రయిస్తూ కుటుంబాలను పోషిస్తున్న చిన్న వ్యాపారులకు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే అధికారులు షాపులు తొలగించారని తెలిపారు. రోజువారీగా దుకాణం వేసి సంపాదించే డబ్బుతోనే కుటుంబం పోషిస్తున్నామని, ఇప్పుడు షాపులు తీసేసి మా జీవనోపాధినే దెబ్బతీశారని వ్యాపారులు వాపోయారు. ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తమ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని మళ్లీ వ్యాపారం చేసుకునే అవకాశాన్ని కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-నక్కపల్లి:పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీటీవో చలపతిరావు అన్నారు. మండలంలో గొడిచెర్ల పంచాయతీ శివారు చేరిక కొత్తూరు గ్రామంలో శుక్రవారం శానిటేషన్ పనులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున ఎప్పటికప్పుడు డ్రైనేజీలను క్లీనింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామ పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. దోమలు ప్రబలి, రోగాలు వ్యాప్తి చెంది అవకాశం ఉన్నందున ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. శానిటేషన్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తీరువా పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి-నర్సీపట్నం: నీటి తీరువా వసూళ్లు చేయాలని తహసిల్దారు రామారావు అన్నారు.శుక్రవారం కార్యాలయంలో గ్రామ రెవిన్యూ అసిస్టెంట్లతో మాట్లాడారు.వీఆర్ఏలు నిర్లక్ష్యం చేయకుండా పన్నుల వసూళ్ల పట్ల దృష్టి సారించాలన్నారు. 20, 30 సెంట్లు వున్న రైతులను ఇబ్బంది పెట్టరాదని సూచించారు. మండల వ్యాప్తంగా 48 లక్షల బకాయిలకు గాను ఇంతవరకు దాదాపు 4.50 లక్షలు వసూలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

కార్మికులకు పని గంటల పెంపు దుర్మార్గం

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-గొలుగొండ:కార్మికులకు వేతనాలు పెంచమంటే పని గంటల పెంపు దుర్మార్గమని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జీ.కోటేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం గొలుగొండలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, డైలీవేజ్, హోటల్స్‌లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్రమైన పని భారంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరికి కార్మిక చట్టాలు, హక్కులు అమలు కాలేదన్నారు. పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖను నిర్వీర్యం చేశారని చెప్పారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి చేయాల్సిన కనీస వేతనాలు సవరణ నేటికి చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బిజెపి తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ లోబడి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా పని గంటలను 8 నుండి 13 గంటలకు పెంచిందన్నారు. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో లక్షలాది మంది కార్మికులను కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాల దోపిడీకి బలి చేయడమేనన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పని గంటల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేకపోతే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి ఎం.మంగ, అధ్యక్షులు భ్రమరాంబ, దేవి, మిడ్డే మీల్ సంఘం నాయకులు చిన్నతల్లి, సీఐటీయూ నాయకులు గంగరాజు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోటేశ్వరరావు


భోజనం రుచి చూస్తున్న కమిషనర్

స్టేట్ ఫుడ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో పలు రేషన్ షాపులు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం స్టేట్ ఫుడ్ కమిషర్ వి.కాంతారావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నక్కపల్లి, ఉపమాక పంచాయతీ శివారు మన బాలవానిపాలెం లో రేషన్ డిపోలను తనిఖీ చేశారు. తూకం, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. పూర్తి పారదర్శకతతో సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు సూచించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను రుచి చూశారు. స్టాక్ రిజిష్టరులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతీరోజూ వండిపెడుతున్న పదార్థాలు రుచిగా, శుభ్రంగా వండుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పెన్నాడ అప్పారావు, మండల విద్యాశాఖ అధికారులు కే నరేష్, నాగన్న దొర, సిఎస్‌డిటి గణపతిరావు, గోడౌన్ ఇన్చార్జి శ్రీపాద ప్రసాద్ పాల్గొన్నారు.

బురదలో కూరుకుపోయిన వాహనాలు

- స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో ఎం.కోడూరు మోదకొండమ్మ గుడి సమీపంలో శుక్రవారం ఉదయం తెల్లవారు జామున రెండు వాహనాలు కూరుకుపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కిలో మీటర్ పొడవునా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎంతసేపటికి ట్రాఫిక్ సమస్య కొలిక్కి రాకపోవడంతో ఎం. కోడూరు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు చొరవ తీసుకొని గోతులలో కూరుకుపోయిన వాహనాలను బయటకు తీయించి గ్రావెల్తో గోతులను కప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండేళ్ళు కావస్తున్నప్పటికీ కనీసం రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా కప్పలేని స్థితిలో ఉందని వాహనదారులు తెలిపారు.


బురద గోతిలో నిలిచిన వాహనాలు


క్రీడాకారులకు సూచనలు ఇస్తున్న ప్రతినిధులు

అండర్ -19 హాకీ సెలక్షన్స్

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లిలో హాకీ క్రీడా మైదానంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో అండర్ -19 బాల బాలికల హాకీ జట్టు సెలక్షన్స్ శుక్రవారం డి.ఐ.ఈ.ఓఎమ్. వినోద్ బాబు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పుష్పలత ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, ఎంపికైన క్రీడాకారులు సమిష్టి కృషితో రాణించాలని ఆకాంక్షించారు. హాకీ క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు బాలికల విభాగం నుండి ఒక జట్టు, బాలుర విభాగం నుండి ఒక జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బియస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, పిడిలు శ్రీ లక్ష్మి, తరుణ్, కోచ్‌లు పాల్గొన్నారు.

అక్రమ మద్యాన్ని అరికట్టడంలో విఫలం : సిపిఎం

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల ఎక్సైజ్ పరిదిలో అక్రమ మద్యం ఏరులై పారుతుందని మామ్ముళ్ళ మత్తులో ఎక్సైజ్ అదికారులు నిద్ర పోతున్నారని దీనిపై సోమవారం పిజిఆర్ఎస్‌లో పిర్యాదు చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి ఇరట.నరసింహమూర్తి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.టి.దోర స్పష్టం చేసారు. శుక్రవారం మాడుగులలో ఏర్పాటు చేసిన సమాశంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు ఎక్కడ ఉన్నాయో చూపిస్తె చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అదికారులు చేప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎక్సైజ్ పరిదిలో ప్రతి గ్రామంలోను విచ్చల విడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహణ చేస్తూ పేదల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేటాయించిన లైసెన్స్ షాపులకు అనుబంధంగా గ్రామాల్లో గోలుసు షాపులు పెట్టి అక్రమ మద్యం అమ్మకాలు చేపడుతున్నారన్నారు. పాన్ షాపులు, దాబాల్లోను,టి కోట్టుల్లో సైతం విచ్చల విడిగా మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్నారు. రోడ్డు పక్కన బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టాన్ని విస్మరించడ మేనని తెలిపారు. బెల్ట్ షాపులో ఒక బాటిల్ దగ్గర అదనంగా 50 నుండి 100 రూపాయలు వసూళ్ల చేస్తూ అడ్డగోలుగా జేబులు నింపుకుంటున్నారని తెలిపారు. అక్రమ అమ్మకాలు జరగడంతో సామాన్యులు, నిరు పేదలు, కూలీల జేబులు ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడి,గుడి వంటి ప్రదేశాల్లో పెట్టరాదని నిభందనలు ఉన్నా ఎక్కడా అమలు కాలేదన్నారు. బెల్ట్ షాపుల వద్ద పదుల సంఖ్యలో మందు బాబులు బార్లు తీరు తున్నారన్నారు. ఇప్పటికైనా అక్రమ బెల్టు షాపులు, లైసెన్సులు లేని దాబాల్లో మద్యం అమ్మకాలుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బాణసంచా గొడౌన్‌ను పరిశీలిస్తున్న తహాశీల్దార్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల: బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనలను అధిగమిస్తే చర్యలు తప్పవని తహసిల్దారు తిరుమల బాబు అన్నారు, రాష్టంలో ఇటీవల పలు ప్రాంతాల్లో బాణాసంచా తయారీ కేంద్రాలు పేలుళ్ల సంభవించిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక ఎస్సై రమేష్, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఎండపల్లి వద్ద గల బాణాసంచా తయారీ కేంద్రం సందర్శించారు. బాణ సంచా తయారీ కేంద్రం వద్ద నిబంధనలు తూచ తప్పకుండా పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ పాల్గొన్నారు.

ఆలిండియా యోగా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -కోటవురట్ల: అంతర విశ్వవిద్యాలయ యోగా పోటీలకు అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని కొంచాడ నందిని ఎంపికయింది. విజయనగరంలో నిర్వహించిన యోగ పోటీలలో నందిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో ఈమె నవంబరు 24 నుండి 28 వరకు స్వామి వివేకానంద సంస్థ నది మెడ్ యూనివర్సిటీ బెంగుళూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొం టుందని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం నందినిని అభినందించారు. బెంగళూరులో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు.


సర్టిఫికెట్ ఇస్తున్న ప్రిన్సిపల్

హాస్టల్ విద్యార్థులకు పరామర్శ

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన బీసీ హాస్టల్ విద్యార్థులను అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు గురువారం రాత్రి పరామర్శించారు. ఈ దాడిని తెలుసుకున్న వెంటనే అప్పారావు నాయుడు హుటాహుటిన రావికమతం బీసీ హాస్టల్‌కు చేరుకొని విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరికి మెరుగైన వైద్యం అందించాలని హాస్టల్ మెట్రిన్కు ఆదేశించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

రావికమతం:పిచ్చికుక్క దాడిలో గాయాలు పాలైన విద్యార్థులను, వ్యక్తులను వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరామర్శిస్తూ, తగిన వైద్యం అందజేయాలని అనకాపల్లి డి ఎం అండ్ హెచ్ ఓ హైమావతి తెలిపారు. పిచ్చికుక్క దాడిలో గాయాల పాలైన బాధితులను శుక్రవారం ఆమె పమర్శించారు. ఎవరు భయపడవద్దని దానికి తగిన వైద్యం అందిస్తామని ఆమె వారికి ధైర్యం చెప్పారు. అనంతరం పీహెచ్సీను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ హేమ సుందర్రావు, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, బీసీ హాస్టల్ మెట్రిన్ లలిత సిబ్బంది పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

12న రామచంద్ర యాదవ్ రాక

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ పర్యటనకు హైకోర్డు అనుమతి ఇచ్చింది. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపేందుకు ఈనెల 12వ తేదీన రాజయ్యపేట రానున్నారు. ఈనెల 5న రాజయ్యపేట పర్యటనకు వస్తున్న రామచంద్ర యాదవ్‌ను రాజమండ్రిలో పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో హైకోర్టు అనుమతితో రాజయ్యపేటకు వస్తానని అదే రోజు ఆయన ప్రకటించారు. ఈ మేరకు ఆయన 12వ తేదీన రాజయ్యపేట వచ్చి మత్స్యకారులు తలపెట్టిన ఉద్యమంలో పాల్గొననున్నారు.